మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన విద్యార్థి నేత

మాజీ మంత్రి కేటీఆర్‌తో క్రాంతి

రామచంద్రాపురం, జూలై 20: బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ని నియోజకవర్గ విద్యార్థి విభాగం సర్కిల్ అధ్యక్షుడు వాలేశెట్టి క్రాంతి శనివారం పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేటీఆర్‌కి శాలువ కప్పేందుకు ప్రయత్నించిన క్రాంతికి తిరిగి కేటీఆరే శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసే వారికి కచ్చితంగా గుర్తింపు ఉంటుందని మాజీ మంత్రి కేటీఆర్ సూచించినట్లు తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని చెప్పారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థి నాయకులకు మంచి గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం పనిచేసే నాయకులను, కార్యకర్తలను కంటికిరెప్పలాగా కాపాడుకుంటామని కేటీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

అందోల్, జూలై 20: రాష్ట్రంలో ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ భాస్కర్‌కుమార్‌కు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నాగభూషణం, గంగాధర్, వెంకటేశం, ప్రకాశ్, నర్సింగ్, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

చేన్లలో నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలి

చౌటకూర్, జూలై 20: పత్తి పంటలో వాన నీళ్లు నిలబడకుండా చూసుకోవాలని సంగపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్‌విశ్వకర్మ సూచించారు. మండలంలోని వెంకటకిష్టాపూర్ గ్రామ శివారులో సాగు చేస్తున్న పత్తి పంటను శనివారం పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వానకు పత్తి పంట సాగుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

సిర్గాపూర్, జూలై 20: మండల పరిధిలోని అంతర్గాం, ముబారక్‌పూర్, సుల్తానాబాద్, సిర్గాపూర్ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శనివారం పర్యటించారు. ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. స్థానికంగా ఎరువుల నిల్వలు, విక్రయాల రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షం కురుస్తున్న సందర్భంగా రైతులు నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న వేళ రైతులకు సరిపడా యూరియా, డీఏపీ అందుబాటులో ఉంచాలని దుకాణదారులకు సూచించారు. అమ్మిన ఎరువుల వివరాలను ఈ పాస్ మిషన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ధరల పట్టికలో వివరాలు, స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు.

అంగన్‌వాడీ భవనం మంజూరుకు వినతి

హత్నూర, జూలై 20: మండలంలోని సికిందాల్‌పూర్‌లో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి శనివారం సంగారెడ్డి మహిళా శిశు సంక్షేమశాఖ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. గ్రామానికి అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ యాదగిరి, గ్రామస్తులు వీరేందర్ పాల్గొన్నారు.

కారు బోల్తా: ఇద్దరు మృతి

సదాశివపేట, జూలై 20: ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి ఇద్దరు యువకులు మృతిచెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని ఆత్మకూర్–సింగూర్ ప్రధాన రహదారిపై శనివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఇబ్రహీంపట్నానికి చెందిన ఆరుగురు యువకులు కారులో సింగూరు ప్రాజెక్టుకు వెళ్తున్నారు. ఆత్మకూర్ శివారులోని సబ్‌స్టేషన్ వద్ద అతివేగంతో వెళ్తున్న కారు పల్టీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సాద్విక్(19) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలైన ఐదుగురిని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా జాకీ(19) మార్గమధ్యలోనే మృతిచెందాడు. గాయాలైన ఫైజాం, కసబ్, సహజాన్, జాహీద్ సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు యువకులు 20 సంత్సరాల లోపు వారే.

మునుపు

రామచంద్రాపురం: నిండుకుండల మారిన ఆర్సీపురం రాయసముద్రం చెరువు

జిన్నారం: జిల్లెల్ల వాగు నుంచి బయటకు వస్తున్న రసాయన వ్యర్థాలు

గుమ్మడిదల: బొంతపల్లిలో వరద నీటిలో కలుస్తున్న వ్యర్థజలాలు

రామచంద్రాపురం, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో రాయసముద్రం నిండుకుండను తలపిస్తున్నది. శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షంతోపాటు మునుపు పడుతుండడంతో ప్రజలు ఇండ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు.

మడుగు కాదు.. రోడ్డే

జిన్నారం/బొల్లారం జూలై 20: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భారీగా నీళ్లు నిలవడంతో ఖాజీపల్లి–బొల్లారం మధ్యలో నుంచి ఉన్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు చిన్నపాటి కుంటను తలపిస్తున్నది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు, బ్రిడ్జి కింద నుంచి ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిల్వ ఉన్న నీరు బయటకు పోయే దారి లేక రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మడుగు మరింత పెద్దదవుతుంది. సంబంధిత అధికారులు నీటి తొలిగింపుకు చర్యలు చేపట్టడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

వరదమాటున వ్యర్థ జలాలు

జిన్నారం, జూలై 20: మండలంలో రెండు రోజులుగా వర్షం ఆగకుండా కురుస్తున్నది. దీంతో మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. పారిశ్రామికవాడలోని గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామిక వాడలో రసాయ వ్యర్థాలు వాన నీటిలో కలిసి ప్రవహించాయి. ఖాజీపల్లి సమీపంలోని జిల్లెల వాగు కాల్వ నుంచి భారీగా రసాయన వ్యర్థాలు బయటకు వచ్చాయి. ఖాజీపల్లి రింగ్ రోడ్డు బ్రిడ్జి కింద రెండు చోట్ల వాన నీరు నిలవడంతో రాకపోకలు స్తంభించాయి.

గుమ్మడిదలలో..

గుమ్మడిదల, జూలై 20: మండలంలోని బొంతపల్లి, దోమడుగు, అనంతారం, మంబాపూర్ తదితర గ్రామాల్లోని రసాయన పరిశ్రమలు వరద మాటున రసాయన వ్యర్థజలాలను వదిలి చేతులు దులుపుకొంటున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వానలకు రసాయన పరిశ్రమలు నిల్వ చేసిన వ్యర్థజలాలను వరదమాటున వదిలివేయడంతో సమీపంలో ఉన్న చెరువులు, కుంటలు కలుషితమవుతున్నాయి. పీసీబీ అధికారులు స్పందించి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బొంతపల్లిలో అలుక చెరువు, జిన్నారం చెరువు, దోమడుగులో రత్నాల చెరువు, మంబాపూర్‌లో మంబాచెరువు రసాయన వ్యర్థజలాలతో కలుషితమైతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖాజీపల్లి సమీపంలో చెరువును తలపిస్తున్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు

భారీ వర్షాలతో తస్మాత్ జాగ్రత్త

- అత్యవసరమైతేనే ప్రయాణాలు చేయాలి
- చెరువులు, కుంటలు చూడటానికి వెళ్లొద్దు
- ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, జూలై 20: అల్పపీడనం కారణంగా జిల్లాలో రెండు రోజులు భారీ వర్షాలు పడుతాయని వాతావరణశాఖ చెప్పడంతో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ శనివారం ప్రకటనలో సూచించారు. ప్రజలకు పలు సూచనలు చేస్తూ అత్యవసరమైన ప్రయాణాలు ఉంటేనే బయటికి రావాలన్నారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. చెరువులు, కుంటలను చూసేందుకు వెళ్లొద్దని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గుర్తించి వర్షాలు తగ్గే వరకు ఇంట్లోనే ఉండాలన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసర సమయంలో 100 డయల్ లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656739కి ఫోన్ చేయాలన్నారు. జిల్లాలో భారీ వర్ష సూచనతో ప్రభుత్వం ఎల్లో అలర్ట్ జారీ చేసిందని, అందుకోసం వర్షాలు పడుతున్నప్పుడు బయటకు రావొద్దన్నారు. జలాశయాలు నిండుకుండలా మారే అవకాశం ఉన్నందున ప్రమాదకారణాలను గుర్తించి ఎక్కడికి వెళ్లొద్దని సూచించారు. జిల్లా పోలీసు అధికారులు అప్రమత్తమై ప్రజలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్‌హెచ్‌ఓలు తమతమ ఏరియాల్లోని చెరువులు, కుంటలను సందర్శించి ఆనకట్టలు ప్రమాదమంచున ఉన్నట్లైతే వెంటవెంటనే సమాచారం అందించాలని కోరారు.

ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు

అందోల్, జూలై 20: భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని అందోల్–జోగిపేట ఆర్డీవో పాండు అన్నారు. శనివారం తన కార్యాలయంలో ట్రాన్స్‌కో, పీఆర్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎలాంటి సమయంలోనైనా ప్రజల సమస్యలపై స్పందించాలన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సైతం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారని, ఎలాంటి ఇబ్బందులున్నా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈఈ శ్రీనివాస్, పీఆర్ డీఈ కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

గుమ్మడిదల, జూలై 20: భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గంగాభవానీ, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. మరో మూడు రోజులపాటు వర్షాలు పడుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. చెరువులు, కుంటల వద్దకు వెళ్లొద్దని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ఘటనలు జరిగినా రెవెన్యూ అధికారులు, పోలీసులకు తెలియజేయాలని కోరారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత గ్రాండ్ టెస్ట్‌లు

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 20: టీజీపీఎస్సీ గ్రూప్ -2 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండు ఉచిత గ్రాండ్ టెస్టులను ఇప్పటివరకు నిర్వహించామని బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. మిగతా రెండు ఉచిత గ్రాండ్ టెస్ట్‌లను ఈ నెల 22, 23న 3వ టెస్ట్, 30, 31న 4వ టెస్ట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. గ్రూప్–2 దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ టెస్టులకు ఎక్కువ సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు బీసీ స్టడీ సర్కిల్ 08455-277015, 99495 92991 నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌వన్నీ అబద్ధాలే..

సంగారెడ్డి, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వం పంట రుణ మాఫీ చేసినం అని గొప్పలు చెప్తూ సంబురాలు చేస్తున్నదని, దీనిపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అబద్ధాలు చెప్పడం కాంగ్రెస్ నైజమని సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి శనివారం ప్రకటనలో విమర్శించారు. రూ.లక్ష మాఫీ అని చెప్పి 40శాతం రైతులకు కూడా మాఫీ జరగలేదని విమర్శించారు. బోగస్ ప్రచారాలు చేస్తున్న కాంగ్రెస్‌కు రైతులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేయడం చేతకాకున్నా కొంత మంది కాంగ్రెస్ నేతలు హరీశ్‌రావు రాజీనామా చేయాలని మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మిగతా రెండు విడతల రుణ మాఫీపై దృష్టి పెట్టాలని కోరారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

కోహీర్, జూలై 20: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతున్నాయన్నారు. ప్రమాదాలు జరుగకముందే వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు కూడా సరిగా లేవన్నారు. కనీస అవసరాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సురేశ్, భరత్, కృష్ణ ఉన్నారు.

భిక్షపతిరెడ్డికి పురస్కారం

అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న సరెడ్డిగారి భిక్షపతిరెడ్డి

గుమ్మడిదల, జూలై 20: ఉత్తమ రక్తదాతలకు ఐవీఎఫ్ సంస్థ పురస్కారాలను అందజేసింది. శనివారం మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన వివేకానంద యోగా గురువు సరెడ్డిగారి భిక్షపతిరెడ్డి ఉత్తమ రక్తదాత పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని వైశ్యభవన్‌లో జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో 73 మంది రాష్ట్ర ఉత్తమ రక్తదాతలకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఐవీఎఫ్ సెంట్రల్ కమిటీ బోర్డు అడ్వైజరీ బోర్డు చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా భిక్షపతిరెడ్డికి ప్రశంసాపత్రం, జ్ఞాపికలతో పురస్కారాన్ని అందజేశారు.

CORRIGENDUM

It is to here by informed that on Dated 19-07-2024 in Namasthe Telangana, Sangareddy District Edition Court Notices Published of **O.S.No. 248 of 2023 & O.S.No. 277 of 2023** Plaintiffs was not mentioned. Please read it as Bank of Baroda Zaheerabad Branch (Vilas Shastry-Advocate, Zaheerabad).

IN THE COURT OF THE HONBLE PRINCIPAL FAMILY COURT INTEGRATED FAMILY COURT - CITY CIVIL COURT AT::HYDERABAD

OP NO. 964 OF 2023

Between:

Smt Puram Swapna ...Petitioner

And

Sri Puram Srinivas ...Respondent

To

Respondent

Sri Puram Srinivas S/o. Sri Puram Posheety, Aged 40 years, Occ: Driver, R/o. 3-159, Goutham Nagar, Ward No.3, Patancheru, Sangareddy District, Telangana State.

Permanent Address: Nandikandi Village, Sadashivapet, Sangareddy District, Telangana State. Hyderabad - 502 001,Ph.No.95534483939.

It is informed you that the above named Petitioner filed the above **OP. No 964 of 2023** against you on the file In The Court Of The Honble Principal Family Court Integrated Family Court - City Civil Court At::Hyderabad for divorce and the same is posted to **23-08-2024** for your appearance at 10.30 A.M Before Hon'ble **IN THE COURT OF THE HONBLE PRINCIPAL FAMILY COURT INTIGRATED FAMILY COURT - CITY CIVIL COURT AT::HYDERABAD** either in person or through your duly instructed advocate. If you do not appear on that day i.e 23.08.2024 the matter will be decided on merits.

Hence this Notice

G ESHWAR KUMAR, ADVOCATE

H.No. 2-19-55/1, Plot No. 107 Road No. 1, Street No.8, Kalyanapuri, Uppal, HYDERABAD 500013, CELL:9553855106

పాత నేరస్తులు సత్ప్రవర్తనతో మెలగాలి

మాట్లాడుతున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కోహీర్, జూలై 20: పాత నేరస్తులు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం జహీరాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో డివిజన్ స్థాయి పాత నేరస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ రూపేశ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పాత నేరస్తులకు అవగాహన కల్పిస్తున్నామని, ఇందులో భాగంగా జహీరాబాద్ పరిధిలో ఉన్న పాత నేరస్తులు పూర్తిగా మారాలని సూచించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రజలను భయభ్రాంతులు, హింసకు గురిచేసినా పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు. పాత నేరస్తులు గంజాయి పండించినా, విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఎలాంటి తగాదాల్లో తల దూర్చొద్దని సూచించారు. గంజాయి పండించే వ్యక్తుల సమాచారాన్ని 8712656777కు అందించాలని కోరారు. సమావేశంలో సీఐలు రవి, నయూమోద్దీన్, ఎస్సైలు అరుణ్‌కుమార్, కాశీనాథ్, రాజేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పటాన్‌చెరులో నిలిచిన వర్షం నీటిని ఖాళీ చేయిస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, జూలై 20: కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతంలో మురుగు నిలిచిపోవడంతో స్పందించిన పటాన్‌చెరు డివిజన్ 113 కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సిబ్బందితో కలిసి శుభ్రం చేయించారు. శనివారం పటాన్‌చెరు పట్టణంలోని మార్కెట్ రోడ్లు, జేపీ కాలనీ, కటికె బస్తీ, శ్రీనగర్‌కాలనీ, విద్యానికేతన్ పాఠశాల వద్ద వర్షం నీరు ఆగిపోవడంతో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి కార్పొరేటర్ స్వయంగా దగ్గరుండి అవి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఒక వైపు వర్షం పడుతున్నా కార్పొరేటర్ స్వయంగా మురుగు నీరు వెళ్లేలా సిబ్బందితో పనిచేయించారు.

ఖాజీపల్లిలో నీటి సమస్యపై సమీక్ష

గ్రామస్తులతో మాట్లాడుతున్న మిషన్ భగీరథ అధికారులు

జిన్నారం, జూలై 20: మండలంలోని ఖాజీపల్లి పంచాయతీలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై సంబంధిత అధికారులు, గ్రామస్తులు శనివారం పంచాయతీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. గ్రామంలో భూగర్భ జలాలు పూర్తిగా కాలుష్యం బారిన పడ్డాయని, ప్రస్తుతం గ్రామానికి సరఫరా అవుతున్న దానికంటే రోజుకు ఒక వ్యక్తికి రెండు వందల లీటర్ల నీటిని సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి ఆరు నెలల మిషన్ భగీరథ నీటి సరఫరా వివరాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో మంజీరా నీటితో పాటు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, గ్రామ శివారులోనే రిజర్వాయర్ నిర్మించాలని గ్రామస్తులు కోరారు. గ్రామస్తుల డిమాండ్లను సమోదు చేసుకున్న అధికారులు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రాజకుమార్, ధరణి, మెడికల్ ఆఫీసర్ భవాని, జేపీసీ చైర్మన్ దండే రామాకాంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, కమిషనర్ జ్యోతిరెడ్డి

అమీన్‌పూర్, జూలై 20: సీజనల్ వాధులతో అప్రమత్తంగా ఉండాలని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం అయ్యారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మున్సిపల్ అధికారులు, హెల్త్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్ నాగరాజు టీపీవో పవన్, ఆర్పో వెంకటరామయ్య పాల్గొన్నారు

'మమ్మల్ని ఆదుకోండి'

గుమ్మడిదల, జూలై 20: దాచారం, దార్గుల్ల గ్రామాల ప్రజలను ఆదుకోవాలని బాధితులు మొరపెట్టుకున్నారు. మండలంలోని ఈ రెండు గ్రామాలను 2015లో వాయుసేన అకాడమీ వీలీనం చేసుకోవడంతో బాధితులు కోర్టును ఆశ్రయించారు. 12 ఏండ్లుగా కోర్టులో నిరాశ్రయులైన తమకు న్యాయం జరిగే దిశగా ఈ నెల 27 కోర్టు తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విషయమై మండల కేంద్రంలో రెండు గ్రామాల ప్రజలు విలేకరులతో మాట్లాడారు. తుమ్మ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమ్మరి ఈశ్వరయ్య మాట్లాడుతూ 2015లో డీఆర్డీవో, వాయుసేన అకాడమీ వారు రెండు గ్రామాలను వీలీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ గ్రామాలకు చెందిన బాధితులు కోర్టును ఆశ్రయించడంతో తీర్పు తమకు న్యాయం జరిగే దిశగా ఉందని తెలిపారు. ఈ విషయంపై జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకరించి తమ గ్రామాల బాధితులకు న్యాయం జరగడానికి కృషి చేయాలని కోరారు. వీరితోపాటు బాధితులు కిరణ్‌రెడ్డి, మహేశ్‌యాదవ్, జోజిరెడ్డి, మల్లారెడ్డి, గాండ్ల భిక్షపతి ఉన్నారు.

ఇక తహసీల్, ఆర్డీవో కార్యాలయాల్లోనూ ప్రజావాణి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూలై 20: ఇక నుంచి జిల్లాలో ప్రతి సోమవారం తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లోనూ ప్రజావాణి నిర్వహించాలని, మండల, డివిజనల్ స్థాయి అధికారులు విధిగా ప్రజావాణికి హాజరు కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అధికారులు, డివిజనల్, మండల, మున్సిపల్, సంబంధిత అధికారులకు కలెక్టర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రజావాణికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో జిల్లాలో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇకపై జిల్లా యంత్రాంగం సెలవు రోజులు మినహా ప్రతి సోమవారం మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో, డివిజనల్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి ఉంటుందన్నారు. సాధారణ ప్రజల కష్టాలను ఆయా కార్యాలయాల్లో (జిల్లా కేంద్రం మినహా)పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

'ఖేడ్' సర్వేయర్‌పై విచారణ చేయాలి

నారాయణఖేడ్, జూలై 20: కలెక్టరేట్‌కు సరెండర్ చేసిన నారాయణఖేడ్ మండల సర్వేయర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిర వీందర్‌నాయక్ ఉన్నతాధికారులను కోరారు. సదరు సర్వేయర్ భూములు సర్వే చేసేందుకు పెద్దఎత్తున వసూళ్లకు పాల్పడ్డడని ఆరోపించారు. సర్వే కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి సర్వే చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కలెక్టర్ స్పందించి సదరు సర్వేయర్‌పై విచారణ జరిపిస్తే అనేక అక్రమాలు బయట పడుతాయన్నారు.

తీర్పును అమలు చేయాలి

బొల్లారం, జూలై 20: బొల్లారం మున్సిపల్ పదో వార్డు కౌన్సిలర్‌గా బురం శైలజ అనర్హురాలిగా ప్రకటిస్తూ జిల్లా జడ్జి ఇచ్చిన జడ్జిమెంట్ కాపీని శనివారం కమిషనర్ మంగతాయారును మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కలిసి అందజేశారు. కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రెండో స్థానంలో ఉన్న ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహరాజు ఎన్నికను లాంచనంగా ప్రకటించి తక్షణమే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ గోపాలమ్మ, ఇండిపెండెంట్ అభ్యర్థి నరసింహరాజు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

హత్నూర, జూలై 20: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన హత్నూర మండలం రెడ్డిఖానాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. హత్నూర ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సాపురం అశోక్‌గౌడ్(40), స్వప్న దంపతులు. వీరికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతుండటంతో ఆరేండ్ల క్రితం స్వప్న పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్లింది. పలుమార్లు భార్యను కాపురానికి రమ్మనగా నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం గ్రామ శివారులోని పత్తికుంటలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

ఎంఈవో కార్యాలయంలో ఖాళీ కుర్చీకి వినతి

ఎమ్మార్సీ కార్యాలయంలో ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

రాయికోడ